వరసిద్ధునికి వెయ్యేళ్ల చరిత్ర

రాష్ట్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో కాణిపాక ఆలయం ఒకటి. స్వయంభుగా వెలిసిన వరసిద్ధి వినాయకస్వామి సత్యప్రమాణాల దేవుడిగా ఆదరణ పొందారు. కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారు స్వామిగా భక్తులు కొలుస్తారు. స్వామివారి దర్శనార్థం తరలివచ్చే భక్తుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఈ క్రమంలోనే వెయ్యేళ్ల చరిత్ర కలిగిన ఆలయాన్ని దాత సహకారంతో అద్భుతంగా పునర్నిర్మించారు. స్వయంభుగా వెలిసిన మూలమూర్తి క్రమంగా పెరుగుతుండడం మరో విశేషం.


కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయం

- తిరుమల తరహాలో కాణిపాక ఆలయం
- రోజురోజుకూ పెరుగుతున్న భక్తుల సంఖ్య
- రూ.50 కోట్లతో ఆలయ అభివృద్ధి పనులు

కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి జిల్లాలోని ఐరాల మండలం కాణిపాకంలో బాహుదా నది ఒడ్డున స్వయంభుగా వెలసి భక్తులకు దర్శనమిస్తున్నారు. స్వామివారిని దర్శించుకోవడానికి తెలుగు రాష్ట్రాలే కాకుండా, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల నుంచి నిత్యం వేల సంఖ్యలో స్వామిని దర్శించుకుంటున్నారు. భక్తుల సౌకర్యార్థం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, దేవదాయ శాఖ అధికారుల అనుమతితో విజయవాడకు చెందిన ఎన్ఆర్ఐల సహకారంతో గత సంవత్సరం రూ.11 కోట్లతో ఆలయ పునర్నిర్మాణం చేపట్టారు. కాంట్రాక్టర్ శ్రీధర్ తంజావూరు శిల్పులతో ఆలయంలో శిల్పసౌందర్యం ఉట్టిపడేలా, ఆధ్యాత్మికత ఉప్పొంగేలా తీర్చిదిద్దారు. గత సంవత్సరం ఆగస్టు 21న ఆలయ మహాకుంభాభిషేకం నిర్వహించారు. అప్పటి నుంచి స్వామివారిని దర్శించుకోవడానికి భక్తులు రోజు 20 వేలకు పైగా వస్తున్నారు.

రెండో తిరుమలగా..

జిల్లాల పునర్విభజన తరువాత కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయం రెండో తిరుమలగా పేరు ప్రఖ్యాతులు సంతరించుకుంది. తిరుమలకు వస్తున్న అన్ని రాష్ట్రాల భక్తులు కాణిపాకం దర్శించుకోవడం ఆనవాయితీగా మారుతోంది. దీంతో స్వామివారి దర్శనార్థం వచ్చే భక్తుల తాకిడి రోజురోజుకూ పెరుగుతోంది. ఇక్కడ దర్శన ఏర్పాట్లు, అన్నదానం క్రమక్రమంగా తిరుమల తరహాలో రూపుదిద్దుకుంటున్నాయి. ఆలయ పునర్నిర్మాణంలో శిల్పకళ ఆకట్టుకునేలా, చరిత్రను తెలుసుకునేలా తీర్చిదిద్దడం మరో విశేషం.

సత్యప్రమాణాల దేవుడిగా.....

వరసిద్ధి వినాయక స్వామివారి ఎదుట తప్పుడు ప్రమాణాలు చేసిన శిక్షపడుతుందని ఇక్కడికి వచ్చే భక్తుల ప్రగాఢ విశ్వాసం. వ్యసనాలకు, బానిసలైన వారు స్వామి ఎదుట ప్రమాణం చేస్తే వాటికి దూరం అవుతారని నమ్మకం. ఇక్కడ రాజకీయ నాయకులు సైతం ప్రమాణాలు చేయిస్తుండడం విశేషం. అసెంబ్లీలో నాయకులు సైతం ఆరోపణలు వచ్చిన సమయంలో కాణిపాకంలో ప్రమాణానికి సిద్ధమా..? అంటూ సవాళ్లు విసురుతుంటారు. ఇక్కడ ప్రమాణం చేస్తే అలాంటి విషయాలను సైతం కోర్టుల్లో న్యాయమూర్తులు అంగీకరించే వారని పెద్దలు చెప్పేవారు.

రూ.50 కోట్లతో ఆలయ అభివృద్ధి పనులు

భక్తులు సంఖ్య రోజురోజుకూ పెరుగుతుండడంతో ఆలయ అభివృద్ధి పనులు రూ.50 కోట్లతో చేపట్టారు. స్వామివారి భక్తులకు నిత్య అన్నదానం గతంలో 2 నుంచి 3 వేల మందికి పంపిణీ చేసేవారు. ప్రస్తుతం రోజు 7 వేల నుంచి 8 వేల మంది భక్తులకు అందించాలని నూతన భవనంలోకి మార్పు చేస్తున్నారు. నూతనంగా వంద గదుల పైన నూతన గదులు, కల్యాణ మండపాలు నిర్మిస్తున్నారు. భక్తులు స్వామివారి ఆలయం వద్దకు రావడానికి వంద అడుగులు రహదారి ఏర్పాటు చేశారు. రహదారి పక్కన ఆహ్లాదకరంగా ఉండేందుకు పార్కులు ఏర్పాటు చేస్తున్నారు.

క్రమేణా పెరుగుతున్న మూలమూర్తి

బావిలో ఉద్భవించిన వినాయకుడి విగ్రహం క్రమేణా నిత్యం పెరుగుతూ ఉండడం విశేషం. చోళ రాజుల కాలంలో కాణిపాక ఆలయంతో పాటు అనుబంధ ఆలయాలు నిర్మించినట్లు చరిత్ర చెబుతున్నది. అప్పట్లో ఈ ప్రాంతాన్ని పరిపాలిస్తున్న కుళతంగ చోళుడనే రాజు 11వ శతాబ్దంలో ఇక్కడ ఆలయాన్ని నిర్మించినట్లు ఆధారాలు ఉన్నాయి. 65 ఏళ్ల క్రితం బహూకరించిన వెండికవచం, 2000, 2002, 2006, 2007లో భక్తులు ఇచ్చిన తొడుగులు స్వామికి ఇప్పుడు సరిపోక పోవడం ఇందుకు నిదర్శనంగా చెబుతారు. ఈ కవచాలను భక్తుల దర్శనార్థం ఆలయంలో ప్రత్యేకించి అలంకరించి ఉన్నారు.


మూలమూర్తికి తొడిగిన వెండి కవచాలు

మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు



“ భక్తుల సౌకర్యార్థం ఆలయంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతాం. ప్రస్తుతం భక్తుల సౌకర్యార్థం అన్నదానం కోసం నూతన భవనం ఏర్పాటు చేశాం. వంద అడుగుల రహదారి, నూతనంగా లడ్డుపోటు భవనం, వంద గదులు, కల్యాణ మండపాలు ఏర్పాటు చేస్తున్నాం. అలాగే స్వామివారి అనుబంధ ఆలయాలను కలుపుకుంటూ మహా ప్రాకారం ఏర్పాటు చేస్తున్నాం. మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతాం.

– మోహన్ రెడ్డి, ఆలయ చైర్మన్, కాణిపాకం

ప్రతి భక్తునికీ దర్శనం కల్పిస్తాం



స్వామివారి దర్శనార్థం వచ్చే భక్తుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. భక్తుల సంఖ్యకు తగినట్లుగా, ఎటువంటి ఇబ్బందులు లేకుండా సులభతర దర్శనం కోసం ఏర్పాటు చేస్తున్నాం. ప్రస్తుతం రోజుకూ 20 వేలకు పైగా భక్తులు వస్తున్నారు. వారి కోసం ప్రత్యేక క్యూల ద్వారా దర్శనాలు ఏర్పాటు చేస్తున్నాం. ఇదే సమయంలో వీఐపీలకు, ప్రజాప్రతినిధులకు ప్రత్యేక క్యూలు ఏర్పాటు చేసి దర్శనాలు కల్పిస్తున్నాం.

– వెంకటేశు, ఈఓ, కాణిపాకం

క్లుప్తంగా

ఐరాల ఎంఈఓగా రుషేంద్రబాబు


ఎంఈఓను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ఐరాల: మండల విద్యాశాఖాధికారిగా రుషేంద్రబాబు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన కుప్పం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్ఎంగా పనిచేస్తూ పదోన్నతిపై ఐరాల ఎంఈఓగా వచ్చారు. ఆయన మాట్లాడుతూ మండలంలో విద్యావ్యవస్థను బలోపేతం చేస్తూ విద్యాభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. ఆయన్ను యూటీఎఫ్, ఎస్టీయూ, పీఆర్టీయూ నాయకులు ఘనంగా సత్కరించారు.

ప్రతి ఇంటికీ వెళ్లి పరీక్షలు చేయాలి


మాధవరంలో వైద్య సిబ్బంది నిర్వహిస్తున్న సర్వేను పరిశీలిస్తున్న వైద్యులు

యాదమరి: ప్రభుత్వాస్పత్రి వైద్య సిబ్బంది కుష్టువ్యాధి నిర్ధారణకు ప్రతి ఇంటికీ వెళ్లి ప్రతి ఒక్కరికీ పరీక్షలు నిర్వహించాలని వైద్యాధికారి అరుణ్‌కుమార్ నాయక్ కోరారు. మండలంలోని మాధవరంలో బుధవారం కుష్టువ్యాధి సర్వే వైద్య సిబ్బంది నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైద్య సిబ్బంది ప్రతి ఇంటికీ వెళ్లి, ప్రతి ఒక్కరికీ కుష్టువ్యాధికి సంబంధించి పరీక్షలు చేయాలని కోరారు. వారి వివరాలు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఓ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరులో వ్యక్తి మృతి


మృతి చెందిన భానుప్రకాష్

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని ఓ లాడ్జిలో వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం వెలుగు చూసింది. పోలీసుల కథనం మేరకు వైఎస్సార్ కడప దేవచెరువుకు చెందిన భానుప్రకాష్(48) బెంగళూరులోని ఓ కంపెనీలో పనిచేస్తున్నాడు. పుత్తూరులో ఇతనికి తెలిసినవాళ్లు ఉండడంతో సోమవారం చిత్తూరు నగరానికి వచ్చి ఓ లాడ్జిలో గదిని అద్దెకు తీసుకున్నాడు. మంగళవారం రాత్రి గుండె నొప్పిగా ఉందని చెప్పడంతో, లాడ్జి సిబ్బంది చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు పేర్కొన్నారు. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

గజ వాహనంపై సిరుల తల్లి కటాక్షం



తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరులో వెలసిన పద్మావతి అమ్మవారు గజ వాహనంపై ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. అమ్మవారి జన్మ నక్షత్రం ఉత్తరాషాడ సందర్భంగా బుధవారం తెల్లవారుజామున సుప్రభాతంతో అమ్మవారిని మేల్కొలిపి నిత్యకైంకర్యాలు చేపట్టారు. తదుపరి అభిషేకం చేసి విశేషంగా అలంకరించారు. అనంతరం శ్రీకృష్ణ ముఖ మండపంలో కనుల పండువగా కల్యాణోత్సవం చేశారు. సాయంత్రం ఆలయ ఆవరణలో అమ్మవారికి ఊంజల్ సేవ చేపట్టారు. అనంతరం అమ్మవారు గజ వాహనంపై ఆశీనులై నాలుగు మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ శేషగిరి, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ సుభాస్కర్ నాయుడు, వీఐ రామ్మోహన్, అర్చకులు బాబు స్వామి తదితరులు పాల్గొన్నారు.

సీఎం పర్యటన విజయవంతం

చిత్తూరు రూరల్: సీఎం పర్యటనను ద్విగిజయం చేసిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ప్రజలకు, ముఖ్యంగా మహిళలకు ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. చిత్తూరు చరిత్రలో ఏ ముఖ్యమంత్రి సభకూ రానటువంటి జనసందోహం సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సభకు వచ్చారన్నారు. ఇందుకు శ్రమించిన పోలీసుశాఖ, రెవెన్యూ శాఖ, మునిసిపల్ కార్పొరేషన్ యంత్రాంగం, పారిశుద్ధ్య కార్మికులు, సచివాలయ ఉద్యోగులు అందరికీ కూడా కృతజ్ఞతలు తెలిపారు.

పీహెచ్‌సీలో సుఖ ప్రసవం


తల్లీబిడ్డతో వైద్యులు

పూతలపట్టు: మండలంలోని చిన్నబండపల్లెకు చెందిన భార్గవికి పీహెచ్‌సీలో వైద్యులు సుఖప్రసవం చేశారు. ఆమె మంగళవారం రాత్రి పురిటినొప్పులతో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చేరగా, బుధవారం ఉదయం 10.40 గంటలకు వైద్యులు కాన్పు చేశారు. ఆమె మగబిడ్డకు జన్మనిచ్చింది. సాధారణ కాన్పుతో తల్లీ, బిడ్డ క్షేమమని డాక్టర్లు తెలిపారు. ప్రభుత్వం పురిటిబిడ్డలకు అందించే వైఎస్సార్ కిట్‌ను డాక్టర్ ప్రవీణ తల్లికి అందజేశారు. స్టాఫ్‌నర్సులు థామస్, ఆయేషా జులేఖా తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయండి

ఐరాల: నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా జగనన్న కాలనీల్లో నిర్మిస్తున్న ఇళ్లను త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీఓ నాగరాజు సూచించారు. మండలంలోని 45 కొత్తపల్లె బీసీ కాలనీలో బుధవారం జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలను ఆయన, సర్పంచ్ శాంతిసాగర్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ మండలంలో 2164 పక్కా గృహాలను ప్రభుత్వం మంజూరు చేసిందని గుర్తు చేశారు. బిల్లులు ఎప్పటికప్పుడు లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తున్నామన్నారు. అదేవిధంగా స్టీల్, సిమెంట్, ఇసుక సకాలంలో అందజేస్తున్నందున ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని లబ్ధిదారులకు సూచించారు.

ఇది కదా.. ప్రోత్సాహం..!


ఉద్యోగులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మేయర్ అముద


కార్మికులతో సరదాగా మాట్లాడుతున్న కమిషనర్ అరుణ

చిత్తూరు అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి చిత్తూరు పర్యటన నేపథ్యంలో నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దడంలో మునిసిపల్ కార్పొరేషన్ అధికార యంత్రాంగం తీసుకున్న ముందస్తు చర్యలు మంచి ఫలితాలనే ఇచ్చాయి. ప్రధానంగా సీఎం పర్యటించే ప్రాంతాలు, గంగినేనిచెరువు కట్ట సుందరీకరణ, డెయిరీ ప్రాంగణంలో పారిశుద్ధ్య నిర్వహణ, బహిరంగ సభ ప్రాంగణాల వద్ద పారిశుద్ధ్య కార్మికులు, ఇంజినీరింగ్ కార్మికులు, రాత్రింబవళ్లు శ్రమించారు. ఇక వార్డు సచివాలయ కార్యదర్శులు, కార్పొరేషన్ కార్యాలయ అధికారులు, సిబ్బంది సైతం తమవంతు తోడ్పాటు అందించారు. ఈ నేపథ్యంలో కార్పొరేషన్ యంత్రాంగం నుంచి కిందిస్థాయి సిబ్బంది వరకు చేసిన శ్రమను గుర్తించిన కమిషనర్ అరుణ బుధవారం అందరికీ ఓ కల్యాణ మండపంలో భోజనాలు ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే శ్రీనివాసులు, మేయర్ అముద, డిప్యూటీ మేయర్లు చంద్రశేఖర్, రాజేష్‌కుమార్ రెడ్డి సైతం హాజరయ్యారు. అధికార యంత్రాంగానికి, సిబ్బందికి, ఉద్యోగులకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. కమిషనర్ సైతం కార్మికులు భోజనం చేసేప్పుడు పేరుపేరునా పలకరించి అభినందించారు. ఇంత కష్టపడినందుకు అన్నం పెట్టి మరీ అందర్నీ పలకరించడంతో కార్మికుల ఆనందానికి అవధుల్లేవు. ఇదే కదా ప్రోత్సాహమంటూ అందరూ సంతోషం వ్యక్తం చేశారు.

విద్యార్థులకు ఆట వస్తువుల వితరణ


విద్యార్థులకు ఆట వస్తువులు అందజేస్తున్న దాతలు

గుడిపాల: మండలంలోని బొమ్మసముద్రం జూనియర్ కళాశాల ఆవరణలో బుధవారం పానాటూరు గ్రామానికి చెందిన సరస్వతి చారిటబుల్ ట్రస్ట్ కుటుంబసభ్యులు వైభవ్, వినోద్ కాలేజీ విద్యార్థులకు ఆట వస్తువులను వితరణగా అందజేశారు. సుమారు రూ.35వేలు విలువ గల వాలీబాల్, బాస్కెట్‌బాల్, రింగ్ టెన్నిస్ తదితర ఆట వస్తువులను అందజేశారు. వైభవ్ (యుఎస్‌ఏ)పేరుతో గల స్పోర్ట్స్ బనియన్లను అందజేశారు. అమెరికాలో బాస్కెట్‌బాల్ ఆటలో నైపుణ్యం గల వైభవ్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు అన్ని ఆటల్లో నైపుణ్యం పెంచుకొని మంచి పౌరులుగా ఎదగాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ శరత్‌చంద్రశేఖర్, ట్రస్ట్ అధ్యక్షులు సరస్వతి, ఆచార్య రాధాక్రిష్టారెడ్డి, అమరనాథరెడ్డి, సాయిహరిత, రియాశ్రీ తదితరులు పాల్గొన్నారు.

బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీకి వినతి

చిత్తూరు కలెక్టరేట్ : వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని రాష్ట్ర కమిషన్ దృష్టికి తీసుకెళ్లినట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వినాయకం అన్నారు. ఈ మేరకు ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యలను రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్ దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. 50 ఏళ్లు దాటిన వారికి డిపార్ట్‌మెంట్ పరీక్షలలో మినహాయింపునివ్వాలని కోరారు. సానుకూలంగా స్పందించిన కమిషన్ చైర్మన్ ప్రభుత్వం దృష్టికి డిమాండ్లు తీసుకెళతానని హామీ ఇచ్చారన్నారు.

గ్రామీణులకు ముంగిట్లో వైద్యం


గుడిపాల: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ పవన్‌కుమార్


వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్


దిగువమాఘంలో రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక

ఐరాల: మండలంలోని గోవిందరెడ్డిపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ బుధవారం 104 వైద్య శిబిరంలో 70 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, చిన్న పిల్లలకు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. ఇళ్లకే పరిమితమైన రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ 45 ఏళ్ల తరువాత ప్రతిఒక్కరూ విధిగా బీపీ, షుగర్ పరీక్షలు చేయించుకుని తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

గ్రామీణులకు వైద్య సౌకర్యం

తవణంపల్లె: గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యమని మండల వైద్యాధికారి ప్రియాంక తెలిపారు. బుధవారం మండలంలోని అరగొండలో డాక్టర్ ప్రియాంక, దిగువ మాఘంలో డాక్టర్ వినయ్‌కుమార్ రెండు వేర్వేరు 104 మొబైల్ క్లినిక్‌ల్లో రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. గర్భిణులు క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఆస్పత్రుల్లో ప్రసవం తల్లీబిడ్డకు శ్రేయస్కరం అన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు రాజశేఖర్, ఆరోగ్య కార్యకర్తలు సుబ్రమణ్యం రెడ్డి, భార్గవి, శ్రీనివాసులు, అనసూయ, నిర్మల, ఎంఎల్‌హెచ్‌పీలు కుసుమ, హైమావతి, డీఈఓలు మహేష్, విజయలక్ష్మి, ఆశావర్కర్లు శోభ, పార్వతి, శారద, మల్లిక, కవిత తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ వైద్య సేవలు

గుడిపాల: ఇంటింటికీ అందించే వైద్య సేవలు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ పవన్‌కుమార్ తెలిపారు. నారగల్లు గ్రామంలో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ నిర్వహించారు. గర్భిణులు, బాలింతలతో పాటు మంచం పట్టిన రోగులు, బీపీ, షుగర్ వంటి సమస్యలతో బాధపడుతున్న వారికి వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులను అందజేశారు. ఇకపై గ్రామాల్లోనే ప్రతి ఒక్కరికీ వైద్య సేవలు అందజేయనున్నట్లు తెలిపారు. వారికి అవసరమైన మందులు, మాత్రలను అక్కడికక్కడే అందించనున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది హైమావతి, సుమతి, గీతా పాల్గొన్నారు.

అశ్వ వాహనంపై కోదండరాముడి విహారం



అశ్వవాహనంపై ఊరేగుతున్న కోదండరాముడు, ఊంజల్ సేవలో స్వామివారు

తవణంపల్లె: మండలంలోని టి.పుత్తూరు కోదండ రామస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి స్వామివారు అశ్వ వాహనంపై విహరించి భక్తులను కటాక్షించారు. దేవస్థానంలో ఉదయం అర్చకులు సీతారామలక్ష్మణులు, ఆంజనేయ స్వామికి అభిషేకం, పూజలు చేయించారు. అనంతరం ఉభయదారులచే స్వామికి తిరుమంజనం, పాలాభిషేకం చేయించారు. తర్వాత స్వామికి ప్రత్యేక అలంకరణ, అర్చనలు, పూజలు నిర్వహించి దీపధూప నైవేద్యం సమర్పించారు. సాయంకాలం ఉభయదారులతో స్వామికి ఊంజల్ సేవ ఘనంగా నిర్వహించారు. ఉభయదారులు స్వామికి పూజాసామగ్రి, తీర్థ ప్రసాదాలు, పుష్పమాలలను ఊరేగింపుగా తీసుకొచ్చి సమర్పించారు. అర్చకులు అభిషేకం, పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

శ్రీరాముడికి అభిషేకం

కోదండరాముల దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి ఉభయదారులతో అశ్వ వాహన సేవను ఘనంగా నిర్వహించారు. ఉభయదారులు స్వామికి పూజాసామగ్రి, ప్రసాదాలు, గజమాలలు, మంగళవాయిద్యాలతో ఊరేగింపుగా తీసుకొచ్చి సమర్పించారు. అర్చకులు ఉత్సవమూర్తి శ్రీరాముడికి అభిషేకం, పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు. పూజలు ముగిసిన తర్వాత భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అశ్వ వాహనంపై కొలువైన కోదండరాముడు పుర వీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు కర్పూర హారతులిచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.

నేడు స్వామికి చక్రస్నానం

కోదండరాముల దేవస్థానంలో గురువారం ఉదయం తిరుమంజనం, పాలాభిషేకం, మధ్యాహ్నం మోహినీ ఉత్సవం, సాయంత్రం ఉట్లోత్సవం, వసంతోత్సవం, చక్రస్నానం నిర్వహించనున్నారు. రాత్రి ధ్వజావరోహణం, ఏకాంత సేవతోపాటు శుక్రవారం నుంచి ప్రత్యేక ఉత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయ వంశపారంపర్య ధర్మకర్త సిద్ధేశ్వర రెడ్డి తెలిపారు.

జగనన్న సురక్షతో విప్లవాత్మక మార్పు

ఐరాల: జగనన్న సురక్ష కార్యక్రమంతో గ్రామాల్లో విప్లవాత్మక మార్పులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని తహసీల్దార్ సుశీలమ్మ అన్నారు. మండలంలోని కామినాయనపల్లె సచివాలయంలో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రజల వినతులను పరిష్కరించడం, అర్హులందరికీ పథకాల ద్వారా లబ్ధి చేకూర్చే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, వలంటీర్లు ప్రతి ఇంటికి వెళ్లి పథకాలు వివరించి అర్హులకు అందజేయడం, సమస్యల పరిష్కారం, 11 రకాల సేవలు ఉచితంగా అందజేయాలన్నారు. అనంతరం 149 మందికి వివిధ సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బంగారమ్మ, వైస్ సర్పంచ్ సోమనాథ్‌రెడ్డి, స్థానిక నేత విజయానందరెడ్డి పాల్గొన్నారు. మండలంలోని కాణిపాకం సచివాలయంలో బుధవారం ఎంపీడీఓ నాగరాజు ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కాణిపాకం సర్పంచ్ శాంతిసాగర్ రెడ్డి, ఎంపీడీఓ నాగరాజు కలిసి 473 మందికి ధ్రువపత్రాలు అందజేశారు. పంచాయతీ కార్యదర్శి సత్యం రెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

లబ్ధిదారులకు సర్టిఫికెట్ల పంపిణీ

యాదమరి: జగనన్న సురక్ష పథకం ద్వారా లబ్ధిదారులకు ఉచితంగా సర్టిఫికెట్లు అందజేస్తున్నట్లు తహసీల్దార్ హనుమంతు, ఎంపీడీఓ శివరాజ్ తెలిపారు. మండలంలోని తెల్లరాళ్లపల్లె సచివాలయ పరిధిలో బుధవారం గ్రామీణ ప్రజలకు సమావేశం నిర్వహించారు. వారం రోజులుగా 125 మంది ర్జీలు పెట్టుకుంటే, అందులో 85 మందికి సర్టిఫికెట్లు అందించారు. అనంతరం సచివాలయ పరిధిలో వైద్య సేవలను తహసీల్దార్, ఎంపీడీఓ పరిశీలించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు గొందివాళ్ల వూరు బాబు పాల్గొన్నారు.




ఐరాల: ధ్రువపత్రాలు అందుకున్న మహిళలతో సర్పంచ్, సర్టిఫికెట్లు అందజేస్తున్న తహసీల్దార్ సుశీలమ్మ, యాదమరి: సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న తహసీల్దార్